క్లుప్తంగా

కేసు నమోదు

దామెర : మొక్కజొన్న పంటకు నిప్పుపెట్టిన వ్యక్తులపై కేసు నమోదు అయ్యింది. ఈ సంఘటన మండలంలోని పులుకుర్తిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెంచాల దేవేందర్, మల్లయ్యకు గ్రామంలో 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో తనకు వాటా ఉందని తమ్ముడు చక్రపాణి గొడవపడ్డాడు. గతంలోనే భూమి పంపకాలు జరిగాయని, తన భూమిలో వాటా రాదని ఇరువురు తేల్చిచెప్పారు. దీంతో చక్రపాణి ఇద్దరు అన్నయ్యలపై కక్షపెంచుకుని గ్రామానికి చెందిన గోవిందు సుధాకర్, గడ్డం సాంబయ్య, జిల్లెల వెంకటస్వామి సాయంతో దేవేందర్‌కు చెందిన 3 ఎకరాల మొక్కజొన్న చేనుకు నిప్పు పెట్టినట్లు తెలిపారు. దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మల్లన్నను దర్శించుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు



ఐనవోలు : ప్రఖ్యాత ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి, కొండపర్తిలోని త్రికూట ఆలయాలను వరంగల్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలన అధికారి ఏ దిలీబన్ సందర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు వేదాశీర్వచనం అందించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఆర్ఐ మల్లయ్య ఉన్నారు.

కావ్యను గెలిపించాలి

ఐనవోలు : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు ఈనెల 30 వ తేదీన హంటర్‌రోడ్‌లోని డీ కన్వెన్షన్‌హాల్‌లో వరంగల్ పార్లమెంట్ స్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి పోతినేని సుదర్శన్‌రావు, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య హాజరు కానున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వరంగల్‌కు ఏమి చేయలేదని తెలిపారు. అదే విధంగా ప్రస్తుత పార్లమెంట్ అభ్యర్థి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో కబ్జాలు చేసి బీజేపీలోకి వచ్చాడని ఆరోపించారు. ఇలాంటివారు ప్రజలకు సేవ చేస్తారా అని ఆయన ప్రశ్నించారు.

ఫ్లెక్సీలు చింపిన వారిపై కేసు నమోదు

సంగెం : పార్లమెంట్ ఎన్నికల ప్రచార రథంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీలను చింపిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. ఖిలావరంగల్ మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన గుండెకారి జైపాల్ మహేంద్ర బోలేరో వాహనంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం ఈనెల 23 నుంచి మే 8వ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడితో ఒప్పందం చేసుకుని ప్రచారం చేస్తున్నారు. కాగా శుక్రవారం నాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా వెంకటాపూర్ నుంచి ప్రచారం నిర్వహిస్తూ మధ్యాహ్నం ఎల్గూర్ స్టేషన్ పరిధిలోని చిలుకమ్మతండాలో భోజనం చేయడానికి వెళ్లే సమయంలో వాహనాన్ని మాజీ సర్పంచ్ ఇంటి ఎదుట ఉంచాడు. ఈ క్రమంలో అక్కడకు వచ్చిన గుగులోత్ శంకర్, బానోత్ రాజు బోలేరో వాహనంలో ఉన్న ఫ్లెక్సీలు చింపుతుండగా జైపాల్ అడ్డుకునేందుకు యత్నించాడు. అయినా శంకర్, రాజు వాహనం ఎందుకు పెట్టావంటూ ఫ్లెక్సీలను చించేశారు. జైపాల్ ఫిర్యాదు మేరకు శంకర్, రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

సీతారాంనాయక్ గెలుపునకు కృషి చేయాలి

నర్సంపేట : మహబూబాబాద్ ఎంపీగా బీజేపీ తరఫున బరిలో నిలిచిన అజ్మీరా సీతారాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు కోరారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. బీజేపీ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే గ్రామ స్థాయి నుంచి దేశం అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సీతారాంనాయక్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరు సందీప్, కొంపెల్లి రాజు, బూత్ అధ్యక్షుడు బూరుగు సాయిరాజ్, సామల ప్రవీణ్‌కుమార్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి భవానిశంకర్, నాయకులు బూరుగు చరణ్, మాసు స్వామి, పోలు సత్యం, అనిల్, సాయికుమార్ పాల్గొన్నారు.

స్టేట్ ర్యాంకర్‌కు సన్మానం

గీసుకొండ : ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటి స్టేట్ సెకండ్ ర్యాంకర్‌గా నిలిచిన మండలంలోని కీర్తినగర్‌కు చెందిన నమిలికొండ కీర్తిని బీఆర్ఎస్ నాయకులు శివ, కమలాకర్, వెంకటేశ్వర్లు తదితరులు శుక్రవారం సన్మానించారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- నెలకోసారి కనిపిస్తున్న స్వచ్ఛ వాహనాలు
- రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారం
- డంపింగ్‌యార్డులను తలపిస్తున్న కాలనీలు



విశ్వబ్రాహ్మణ వీధి నుంచి శివాలయం వెళ్లేదారిలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

పరకాల : పారిశుద్ధ్య సిబ్బంది కొరత, పట్టణానికి సరిపోని స్వచ్ఛ వాహనాలతో పాటు అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పట్టణంలో పారిశుద్ధ్య పనులు పడకేశాయి. పరకాల మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డుల్లో పనిచేసేందుకు 72 మంది పారిశుద్ధ్య కార్మికులతోపాటు మూడు ట్రాక్టర్లు, 10 స్వచ్ఛ వాహనాలు ఉన్నాయి. గతంలో 20 వార్డులు ఉండగా రాజిపేట, సీతారాంపూర్ గ్రామాలను విలీనం చేయడంతో మరో రెండు వార్డులు పెరిగాయి. అంతే స్థాయిలో కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో ప్రస్తుతం ఉన్న కార్మికులపై పనిభారం పడుతోంది. దీంతో మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనుల్లో జాప్యం జరుగుతోంది. వాడ వాడకు తిరుగాల్సిన స్వచ్ఛ వాహనాల్లో 3 మరమత్తుకు రావడంతో చెత్త తరలింపు లేక ఆయా వార్డుల్లో, రోడ్లపైనా చెత్తాచెదారం పేరుకుపోతోంది. రోడ్లపైన, ముఖ్య కూడళ్లు డంపింగ్ యార్డులను తలపిస్తూ కంపుకొడుతున్నాయి.

పోచారంలో డంపింగ్ యార్డు..

మున్సిపాలిటీకి సంబంధించిన డంపింగ్ యార్డు మండలంలోని పోచారం గ్రామ శివారులో ఏర్పాటు చేశారు. పట్టణంలో సేకరించిన చెత్తను 10 కిలోమీటర్ల దూరానికి తరలించడం సవాలుగా మారుతోంది. డీజిల్ ఖర్చులు పెరిగిపోవడంతో ఏదైనా వాహనం రిపేరుకు వస్తే మరమ్మతు చేసేందుకు మున్సిపాలిటీ ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటుంది. ఆయా వాహనాలను మరమ్మతులు చేయించడంలో మున్సిపాలిటీ నిర్లక్ష్యం వహిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు శుభ్రం చేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది

రోడ్లపై చెత్తవేస్తే చర్యలు

మున్సిపాలిటీని స్వచ్ఛతా పట్టణంగా మార్చేందుకు ప్రజల సహకారం చాలా అవసరం. వాస్తవానికి 2 చెత్త తరలింపు వాహనాలు రిపేర్‌కు వచ్చాయి. వాటిని బాగు చేయించి వాడవాడకు అందుబాటులో ఉంచుతాం. పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటాం. పట్టణంలో పేరుకపోయిన చెత్తను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

-కె.నర్సింహ, పరకాల మున్సిపల్ కమిషనర్

కాంగ్రెస్, బీజేపీల అబద్ధపు హామీలను నమ్మొద్దు

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

దామెర : కాంగ్రెస్, బీజేపీ ఇస్తున్న అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు కోగిల్వాయి, పులుకుర్తి, పసరగొండ, ల్యాదెళ్ల, సింగరాజుపల్లి, వెంకటాపూర్, దమ్మన్నపేట్, దుర్గంపేట్, సీతారాంపూర్, ఒగ్లాపూర్, తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లి గ్రామాల్లో శుక్రవారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ అబద్ధపు హామీలను ఇస్తూ ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో విఫలమయ్యిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, ప్రధానకార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి, ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ, సీనియర్ నాయకులు పోలం కృపాకర్ రెడ్డి, దాడి మల్లయ్య, కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, పున్నం సంపత్, గోగుల సత్యనారాయణరెడ్డి, గరిగె కృష్ణమూర్తి, సయ్యద్ అక్తర్, బత్తిని రాజు, వేల్పుల ప్రసాద్, హింగె శ్రీనివాస్, నేరెళ్ల కమలాకర్ ఆయా గ్రామ శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఊరుగొండలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

శాయంపేట : రైతు సంక్షేమమే ధ్యేయమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు అందక పంటలు నష్టపోతున్న రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. మండలంలోని వసంతాపూర్, సూర్యనాయక్‌తండా, గంగిరేణిగూడెం గ్రామాల్లో శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ఎంపీపీ తిరుపతిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతితో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. గత 10ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మాటలతోనే కాలయాపన చేస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలం దరూ తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీనివాసులు గుండెపోటుతో ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు గుణపాఠం తప్పదు

- పార్లమెంటరీ ప్రభారి మురళీధర్‌గౌడ్



మాట్లాడుతున్న మురళీధర్‌గౌడ్

పరకాల: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని బీజేపీ వరంగల్ పార్లమెంటరీ ప్రభారి మురళీధర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని మయూరి గార్డెన్‌లో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నియోజకవర్గ రైతు సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రైతులను మోసం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్, కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ పరిపాలనలో పూర్తిగా విఫలమైనందని, ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. ఆగష్టు 15వ తేదీలోపు రుణమాఫీ చేస్తామని చెబుతూ కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు దిండు సారయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు, పార్లమెంట్ కోకన్వీనర్స్ తాళ్లపల్లి కుమారస్వామిగౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్ది మహేందర్‌రెడ్డి, మారపల్లి రామచంద్రారెడ్డి, బెజ్జంకి శేషాద్రి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, మేకల రాజవీర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన వంగాల బ్రహ్మచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని శుక్రవారం అమ్మ ఫౌండేషన్ చైర్మన్, అమ్మ అశోక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 3వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట చిట్టి రమేష్, సురేష్, తిరుపతి, నవీన్ ఉన్నారు.

నేత్రపర్వంగా రాములోరి రథోత్సవం

- పురవీధుల్లో కొనసాగిన శోభాయాత్ర
- బారులుదీరిన భక్తులు
- నాగవెల్లి, పవళింపుసేవతో ముగిసిన సీతారాముల బ్రహ్మోత్సవాలు



సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణులను పెద్ద రథంపై పుర వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ రథోత్సవానికి మండలంలో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన పెద్ద రథోత్సవం రాత్రి వరకు కొనసాగగా హనుమాన్ మాలాధారులు, భక్తులు పెద్ద రథాన్ని లాగి భక్తి ప్రపత్తును చాటుకున్నారు. స్థానిక రామాలయంలో రాత్రి సీతారాముల నాగవెల్లి, పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. రథోత్సవం సందర్భంగా మిత్రా యూత్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పరాశరం సత్యనారాయణాచార్యులు, సీతారామాచార్యులు, వెంకటాచార్యులు, ఆదిత్యతేజ, రాఘవాచార్యులు, మణికంఠ భిక్షపూచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సీతారాములను దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలు

రామాలయ నిర్మాణానికి భూమి పూజలు



వెంకటాపూర్‌లో భూమిపూజ చేస్తున్న నాయకులు



ఒంటిమామిడిపల్లిలో..

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్, ఒంటిమామిడిపల్లి గ్రామాల్లో రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు శుక్రవారం భూమి పూజలు చేశారు. ఎంపీటీసీలు, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు, గ్రామ పెద్దలు భూమి పూజల్లో పాల్గొన్నారు. వెంకటాపూర్ గ్రామంలో 1994 నుంచి రామాలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సీతారాముల కల్యాణం నిర్వహిస్తుండగా.. 150 మంది సభ్యుల కమిటీ ఆధ్వర్యంలో గతంలోనే ఆలయ నిర్మాణానికి స్థలం కొనుగోలు చేశారు. కాగా ఇటీవల నిర్మాణ కమిటీకి అధ్యక్షుడిగా దామెరగిద్ద నేతాజీని నియమించి రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదే విధంగా ఒంటిమామిడిపల్లి గ్రామంలో గత రెండు సంవత్సరాలుగా శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ సంవత్సరం దాతల సహకారంతో సీతారాముల ఉత్సవ విగ్రహాలను పంచలోహాలతో చేయించారు. కాగా రెండు రోజుల క్రితం గ్రామస్తులందరూ సమావేశమై గ్రామంలోని బోడగుట్టపై రామాలయ నిర్మాణం చేపట్టడానికి సుముఖత చూపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రామాలయ నిర్మాణానికి గ్రామస్తులు భూమి పూజ చేశారు. రెండుచోట్ల ఆలయ నిర్మాణ కమిటీ, గ్రామస్తులు, ఇతరులు, దాతల నుంచి చందాలు సేకరించి నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వెంకటాపూర్ భూమిపూజల్లో పాల్గొన్న వారిలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నేతాజీ, ఎంపీటీసీ మాధవి, సొసైటీ డైరెక్టర్ చిరంజీవి, మాజీ సర్పంచ్ రేణుక, ఒంటిమామిడిపల్లిలో ఎంపీటీసీ రాజు, మాజీ సర్పంచ్ దయాకర్, సభ్యులు రాజు, సంపత్, అశోక్, రాజు, యాదవ సంఘం నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

పోషక లోపాన్ని ముందే గుర్తించాలి



చిన్నారి బరువు చూస్తున్న సంపూర్ణ

నడికూడ : పిల్లల్లో ఏర్పడే పోషకలోపాన్ని ముందే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని అంగన్‌వాడీ టీచర్ సంపూర్ణ సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–2 లో శుక్రవారం పోషకాహార లోపం, నివారణ చర్యలపై పిల్లల తల్లిదండ్రులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంపూర్ణ మాట్లాడుతూ.. కొలమానం ప్రకారం పిల్లల ఎదుగుదల ఉండాలన్నారు. పిల్లల్లో పోషకలోపంటే గుర్తించి వెంటనే నివారించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ఉపయోగం గురించి తెలిపారు.

గంగమ్మ, పెద్దమ్మతల్లి ఆలయాలు ప్రారంభం

నెక్కొండ : మండలంలోని వెంకటాపురంలో ఇటీవల నిర్మించిన గంగమ్మ, పెద్దమ్మతల్లి ఆలయాలను యాదవ, ముదిరాజ్ కుల సంఘాల నాయకులు శుక్రవారం ప్రారంభించారు. రెండ్రోజులుగా ఆ ఆలయాల్లో పూజలు కొనసాగుతున్నాయి. సదరు కులాల ప్రజలు ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. భక్తులు తలపై బోనాలతో ఆలయాలకు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా యాదవ సంఘం పెద్ద గొల్ల మూటిక ఐలయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బోయిన యాకాంబ్రం మీడియాతో మాట్లాడారు. యాదవ కులస్తులు గంగమ్మకు, ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లికి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఆయా కులాల ప్రజలు ఐక్యతతో ఆలయాలను నిర్మించుకున్నారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి.కుమార్, యాదవ సంఘం సభ్యులు రాజన్న, ఐలయ్య, రమేశ్, రాజు, ముదిరాజ్ సంఘం సభ్యులు మధు, నారాయణ, యాదగిరితో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపీపీ సుమలత

ఆత్మకూరు : మండలంలోని ప్రజలకు అధికారులు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎంపీపీ మార్క సుమలత అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ సుమలత మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నీరుకుళ్ల ఎంపీటీసీ అర్షం వరుణ్‌గాంధీ మాట్లాడుతూ.. గ్రామంలో విద్యుత్ సమస్య నెలకొందని సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, పంచాయతీ కార్యదర్శులు ఉదయం గ్రామాలకు వెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సహకారంతో అధికారులు పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రభాను, పీఆర్ డీఈ భానుకుమార్, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సంగీత, ఎంఆర్ఐ రవీందర్, ఎంఈఓ రమాదేవి, విద్యుత్ ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ ధర్మానాయక్, ఎంపీటీసీలు భాగ్య, ఇందిరా, రమ పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..



కామారం సీసీ రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న



కామారం ప్రధాన రోడ్డుపై ఆరబోసిన మక్కలు

ఆత్మకూరు : గతంలో రోడ్లపై ధాన్యం ఆరబోయగా వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ ఉన్నాయి. అయినా గ్రామాల్లో పరిస్థితి మారడం లేదు. మండలంలోని కామారంతో పలు గ్రామాల్లో రహదారులపై మొక్కజొన్న ఆరబోశారు. రైతులు రోడ్లపై ధాన్యం, మొక్కజొన్న ఇతర పంటలు ఆరబోయడం వలన రాత్రివేళ రాకపోకలు చేసే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహనదారులు, స్థానికులు అంటున్నారు. అధికారులు చొరవచూపి రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కోరుతున్నారు. రోడ్లపై ఆరబోయకుండా రైతులకు అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరుతున్నారు.

వైభవంగా పెద్దమ్మతల్లి బోనాలు



పరకాల : మండలంలోని నాగారం గ్రామంలో గీతపారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దమ్మతల్లి బోనాల పండుగను గౌడ కులస్తులు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. బోనాలతో బయలుదేరిన మహిళా భక్తులు.. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో కులసంఘం పెద్దలు, సంఘం నాయకులు పాల్గొన్నారు.